ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

గురువారం 5 జూన్ 2025

చికెన్ ధరలు	
లైవ్	140
డ్రెస్	240
స్కిన్‌లెస్	260
గుడ్లు డజన్	72

ఉష్ణోగ్రత	
గరిష్ఠం	38.0
కనిష్ఠం	24.4

పోచంపల్లిలో ఫ్యాషన్ విద్యార్థులు

● చేనేత కళానైపుణ్యం అద్భుతంగా ఉందని కితాబు



పోచంపల్లిలో సందడి చేస్తున్న విద్యార్థులు

7



తుర్కపల్లి మండలం తిర్మలాపూర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదిక, సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

సీఎం పర్యటనకు..
సర్వం సిద్ధం

● తిర్మలాపూర్‌లో ముమ్మర ఏర్పాట్లు
● ప్రజలు కూర్చోవడానికి వాటర్ ప్రూఫ్ టెంట్లు

తుర్కపల్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): తుర్కపల్లి మండలం తిర్మలాపూర్ గ్రామంలో సీఎం సభకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. సభ నిర్వహణకు రెండు రోజుల గడువే ఉండడంతో కలెక్టర్ హనుమంతరావు పర్యవేక్షణలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వీరారెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ బాలప్రసాద్, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్‌తోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు సభా నిర్వహణ పనులను దగ్గరుండి చూసుకుంటున్నారు. ఈ నెల 6న తిర్మలపూర్‌లో మధ్యాహ్నం 3గంటలకు బహిరంగ సభ జరగనుంది. ఈ సందర్భంగా ఆలేరు నియోజకవర్గంలో సుమారు రూ.1500కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు ఇక్కడే శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం బహిరంగ సభలో సీఎం మాట్లాడతారు. భువనగిరి-గజ్వేల్ రహదారి పక్కన ఐదెకరాల విస్తీర్ణంలో సభా వేదిక నిర్మాణంతోపాటు ప్రజలు కూర్చోవడానికి వాటర్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. అదనంగా పార్కింగ్ స్థలాలకోసం మరో ఇరవై ఎకరాలు కేటాయించారు. ఈ వాటర్ ప్రూఫ్ టెంట్లతో మూడు షెడ్లను ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా వేదిక ముందు భాగంలో మీడియా, వీఐపీలకు ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వీఐపీల పార్కింగ్ స్థలంతోపాటు ప్రజలు వచ్చేందుకు సభా ప్రాంగణానికి రెండు వైపుల మరో నాలుగు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు.



8

పటిష్ఠ బందోబస్తు

● రాచకొండ సీపీ సుధీర్‌బాబు
● సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ఎల్ఈడీ తెరల ఏర్పాట్లు

సభా వేదికకు ఇరువైపులా కూర్చున్న ప్రజలు వీక్షించేందుకుగాను రెండు పెద్ద ఎల్ఈడీ తెరలు, అక్కడక్కడ చిన్న చిన్న ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేయనున్నారు. సభా వేదికకు సుమారు 350 మీటర్ల దూరంలో హెలీప్యాడ్‌కు వృత్తాకారంలో 50పీట్లతో సీసీ వేశారు. దీని వెలుపల నుంచి 80 ఫీట్ల వృత్తాన్ని ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణంలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. పోలీస్ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో బందోబస్తు చర్యలు చేపడుతున్నారు.

సభకు హాజరుకానున్న మంత్రులు

అభివృద్ధి పనులకు సీఎం శంకు స్థాపన చేయనున్న నేపథ్యంలో ఆయా శాఖల మంత్రులు రేవంత్‌రెడ్డి వెంట రానున్నారు. మంత్రులు ..మిగతా 8వ పేజీలో



యాదగిరిగుట్టలో విలేకరులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

'ఆలేరు' ప్రజల చిరకాల వాంఛ
నెరవేరబోతోంది

● రూ.1500 కోట్లతో అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం
● ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రూ.700 కోట్లతో నిర్మించనున్న గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 6న శంకుస్థాపన చేస్తుండడంతో 30 ఏళ్ల ఆలేరు నియోజకవర్గ ప్రజల చిరకాలవాంఛ నెరవేరబోతోందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. బుధవారం యాదగిరిగుట్టలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వాయర్ నిర్మాణంతో లక్ష ఎకరాలకు సాగునీరు అందించవచ్చునని, దీంతోపాటుగా రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ ..మిగతా 8వ పేజీలో

భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

● కలెక్టర్ హనుమంతరావు



నాగారంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

వలిగొండ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి భూభారతి చట్టం అమలు చేస్తున్నట్లు కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. బుధవారం మండలంలోని నాగారం గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. భూసమస్యలను పరిష్కరించి రైతులకు వారి భూములపై హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టం చేస్తుందన్నారు. భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను సదస్సులో స్వీకరించి ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా అర్జీలను పూర్తిస్థాయిలో పరిష్కారిస్తామన్నారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన విచారణకోసం వచ్చే రెవెన్యూ బృందాలకు సహకరించాలన్నారు. రైతులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాగారంలో 15 దరఖాస్తులు, చిత్రాపురంలో రెండు దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ దశరథ, ఎంఆర్ఐ కరుణాకర్, సీనియర్ అసిస్టెంట్ మనోహర్, రెవెన్యూ సిబబ్బంది పాల్గొన్నారు.

'భూభారతి'తో రైతులకు మేలు

● అదనపు కలెక్టర్ వీరారెడ్డి



నాగారంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరి రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన భూభారతి చట్టంతో రైతులకు మేలు చేకూరుతుందని అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి అన్నారు. బుధవారం భువనగిరి మండలంలోని వడపర్తి, పగిడిపల్లి గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా వడపర్తిలో జరిగిన సదస్సును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. భూ సమస్యలను పరిష్కరించి రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలు చేస్తుందన్నారు. భూ రికార్డుల్లో తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్ పట్టా పాస్ పుస్తకాలు లేకపోవడం తదితర అంశాలకు సంబంధించి రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వడపర్తిలో 12మంది రైతులు, పగిడిపల్లిలో తొమ్మిది మంది రైతులు భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు సమర్పించినట్లు తహసీల్దార్ ఎన్.అంజిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు కల్యాణ్, ప్రణయ్, ఆర్ఐలు సైదాసాహెబ్, వి.బలరాం, రజినీష్ ప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎలిమినేటి కృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థలు నిబంధనలు పాటించాలి

● అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) భాస్కర్‌రావు

భువనగిరి (కలెక్టరేట్), జూన్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలకు లోబడి పనిచేయాలని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) భాస్కరరావు అన్నారు. బుధవారం ఆయన జిల్లా విద్యాధికారి కే.సత్యనారాయణతో కలిసి ప్రైవేట్ యాజమాన్యాలతో జూమ్ మీటింగ్ నిర్వహించి పలు సూచనలు చేశారు. పాఠశాల ఏ పేరుతో గుర్తింపు పొందితే, అదే పేరుతో నడపాలని పాఠశాల పేరుకు అదనంగా టెక్నో, టాలెంట్ ఇతర పదాలను చేర్చితే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకే నియమిత ఫీజులు వసూలు చేయాలని, అధికంగా ఫీజులు తీసుకోవద్దన్నారు. తరగతులవారీగా పుస్తకాల విక్రయాలు జరుపుతున్నట్లు తెలుస్తోందని, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం సహా విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ప్రైవేట్ పాఠశాలలతో ఇబ్బందులు కలుగకుండా నడపాలన్నారు. సమావేశంలో ఏడీ ప్రశాంత్ రెడ్డి, విద్యా సంస్థల అధినేతలు పాల్గొన్నారు.

ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటయ్యేనా?

జిల్లాలో ఆలేరు కేంద్రంగా కొత్తగా రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు గత కొన్నేళ్లుగా కోరుతున్నారు. ఆధ్యాత్మికంగా, చారిత్రకంగా ప్రసిద్ధమైన జిల్లాలో పరిపాలనా సౌలభ్యంకోసం ఆలేరును రెవెన్యూ డివిజన్ చేయాలన్న డిమాండ్ ఉంది. ప్రస్తుతం జిల్లాలో రెండు రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2021లో నూతనంగా రాష్ట్రంలో పలు రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేసినా, ఆ జాబితాలో ఆలేరు లేకపోవడం ఆశ్చర్యకరం.

(ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

● కొత్త నిర్ణయం కోసం ప్రజల నిరీక్షణ
● గతంలో ప్రతిపాదించినా ఏర్పాటు చేయని వైనం
● సీఎం పర్యటన నేపథ్యంలో డివిజన్ ఏర్పాటుపై స్థానిక ప్రజల ఆశలు

ఆలేరును రెవెన్యూ డిమాండ్ చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై ప్రభుత్వం నుంచి స్పందన రాలేదు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా మారుస్తానని ప్రస్తుత ఎమ్మెల్యే, విప్ బీర్ల అయిలయ్య ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. అయితే ఈ నెల 6వ తేదీన పలు అభివృద్ధి పనులపై శంకుస్థాపనకోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలేరు నియోజకవర్గం తుర్కపల్లి మండలం తిరుమలాపురం గ్రామానికి రానున్నారు. ఈనేపథ్యంలో ఆలేరు రెవెన్యూ డివిజన్‌పై నూతన ప్రభుత్వం ఏమైనా నిర్ణయం తీసుకుంటుందా? అన్న అంశంపై స్థానిక ప్రజల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. డివిజన్ ఏర్పాటుపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని ప్రజలు వేచి చూస్తున్నారు.

ఎనిమిది లక్షలకు పైగా జనాభా

జిల్లా భౌగోళికంగా దాదాపు 3,795 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 17మండలాలు, 318 రెవెన్యూ గ్రామాలు, 428 గ్రామపంచాయతీలు, ఆరు మునిసిపాలిటీలున్నాయి. జిల్లాలో దాదాపు 8లక్షల జనాభా ఉంది. భువనగిరి, చౌటుప్పల్ డివిజన్ల పరిధిలో 17 మండలాలు, 318 రెవెన్యూ గ్రామాలున్నాయి. భువనగిరి రెవెన్యూ డివిజన్‌లో 12 మండలాలు 212 రెవెన్యూ గ్రామాలు, చౌటుప్పల్ డివిజన్‌లో 5 మండలాలు 106 రెవెన్యూ గ్రామాలున్నాయి. జిల్లాలో భువనగిరి, ఆలేరు నియోజకవర్గాలు పూర్తిగా ఉండగా, చౌటుప్పల్ ఆర్డీవో పరిధిలోని మునుగోడు నియోజకవర్గంలోని చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం మండలాలు జిల్లా పరిధిలో ఉన్నాయి. అదేవిధంగా నకిరేకల్ నియోజకవర్గంలోని రామన్నపేట మండలం, తుంగతుర్తి నియోజకవర్గంలోని మోత్కూరు, అడ్డగూడూరు మండలాలు ఉన్నాయి.

'ఆలేరు డివిజన్'పై గతంలో ప్రతిపాదనలు ఇలా..

జిల్లాలో మూడో రెవెన్యూ డివిజన్‌గా ఆలేరు కేంద్రంగా ఏర్పాటుచేయాలని ప్రభుత్వం ప్రతిపాదనలు ..మిగతా 8వ పేజీలో



ఆలేరు పట్టణం

గత బీఆర్ఎస్ ప్రభుత్వం లాగానే



గత బీఆర్ఎస్ ప్రభుత్వం లాగానే ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సవితి తల్లి ప్రేమను చూపిస్తున్నది. గత బీఆర్ఎస్ ఎమ్మెల్యే గొంగిడి సునీత ఆలేరు ప్రజలను ఊరించి మోసం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సభలో వంద రోజుల్లో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలి. ప్రజా ఉద్యమాల ద్వారానే రెవెన్యూ డివిజన్ సాధ్యం. అన్ని వర్గాల ప్రజలు, వర్గాలు కదలి రావాలి.

రాచకొండ జనార్థన్, న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి, ఆలేరు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు నిధులు పెంచాలి

● మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి, నెల్లికంటి సత్యం, పక్కన కలెక్టర్ హనుమంతరావు

చౌటుప్పల్ రూరల్, జూన్4(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు నిధులు పెంచాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం చౌటుప్పల్ మండలం దామెరలో జరిగిన చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం మండలాల ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు 1,154 మందికి మంజూరు పత్రాలను ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, కలెక్టర్ హనుమంతురావుతో కలిసి ఆయన అందజేసి మాట్లాడారు. ఇళ్ల నిర్మాణ సామగ్రి ధరలు పెరిగినందున ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు సరిపోవని, అదనంగా నిధులు పెంచేలా కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. 60 గజాలకు మించి ఇంటి నిర్మాణం చేపట్టవద్దనే నిబంధన సరికాదని, ఈ నిబంధన మార్చాలని తాను గతంలోనే డిమాండ్ చేసినట్లు గుర్తుచేశారు. నల్లగొండ జిల్లాలో సిమెంట్ పరిశ్రమలు అధికంగా ఉన్నందున పరిశ్రమల యాజమాన్యాలతో మాట్లాడి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తక్కువ రేటుకు సిమెంట్ ఇప్పించేలా కృషి చేస్తానన్నారు. ప్రతీ పేదవానికి ఇంటి నిర్మాణం చేయించే బాధ్యత తనదేనని, మొదటి విడతలో రాకపోయినా ఇబ్బంది పడొద్దన్నారు. ఇంతమంది లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ పత్రాలు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదన్నారు. మునుగోడు నియోజకవర్గంలో 10వేల ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా కృషి చేస్తానని స్పష్టంచేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, ఆర్డీవో శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ మీరాబాయి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య, మాజీ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, వైస్ చైర్మన్ కాసుల ఇంద్రసేనారెడ్డి, పబ్బు రాజుగౌడ్, మాజీ జడ్పీటీసీ చిరుకూరి ప్రభాకర్ రెడ్డి, గుత్త ఉమాదేవి, భద్రయ్య, దేవేందర్, నర్సింహగౌడ్ పాల్గొన్నారు.

రసాయన ఎరువులు
మోతాదు మించితే నష్టమే

● పంటల దిగుబడి తగ్గుతుంది
● 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌ఇన్‌లో ఏడీఏ శాంతి నిర్మల



'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ శాంతి నిర్మల

సేంద్రియ ఎరువులతో పంటలు సాగుచేస్తే రైతులకు అధిక దిగుబడులు వస్తాయి. దీంతో రైతులు లాభాలు పొందుతారు. రసాయన ఎరువులకంటే సేంద్రియ ఎరువులు విధిగా వాడుకోవాలని యాదగిరిగుట్ట ఏడీఏ శాంతినిర్మల తెలిపారు. పంట సాగు చేసే రైతులు మోతాదుకు మించిన రసాయన ఎరువులను వినియోగిస్తే పంటల దిగుబడి తగ్గి నష్టపోతారని తెలిపారు. బుధవారం పంటల సాగుపై రైతుల సమస్యలు, సందేహాలను నివృత్తి చేయడానికి బుధవారం ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించగా పలు విషయాలను వెల్లడించారు. డివిజన్‌లోని రైతులు ఫోన్‌చేసి వరిలో అధిక దిగుబడులు వచ్చే విత్తనాలు, సేంద్రియ ఎరువులు, రసాయన ఎరువుల వినియోగం, తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.

(ఆంధ్రజ్యోతి- యాదగిరిగుట్ట రూరల్)

8

సమష్టి కృషితో క్షయ నిర్మూలన

డీఎంహెచ్‌వో డాక్టర్ మనోహర్

భువనగిరి రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితో క్షయ వ్యాధి నిర్మూలన సాధ్యమవుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మనోహర్ అన్నారు. బుధవారం మండలంలోని బీఎన్ తిమ్మాపూర్‌లో సంచార టీబీ ముక్త్ వాహనాన్ని బుధవారం ప్రారంభించి మాట్లాడారు. భారత్ అభియాన్‌లో భాగంగా 2025 నాటికి భారత్‌ను క్షయ రహిత దేశంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. టీబీ బాధితులను గుర్తించడానికి జిల్లాలోని ప్రతీగ్రామంలో సంచార టీబీ వాహనం పర్యటిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి సాయిశోభ, మండల వైద్యాధికారి యామిని, వైద్యులు మురళీమోహన్, కాంచన, సూపర్‌వైజర్లు రమాదేవి, విజయ, గిరిబాబు, సోమ కృష్ణయ్య, భేగం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



బీఎన్ తిమ్మాపూర్‌లో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో మనోహర్

పాల శీతలీకరణ కేంద్రానికి తాళం

● మోత్కూరు, రాజాపేటలో పాడి రైతుల ఆందోళన ● బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన



మోత్కూరు పాల శీతలీకరణ కేంద్రానికి తాళం వేయడంతో రోడ్డుపై నిలిచిపోయిన పాల వ్యాను

7

పెండింగ్‌లో ఉన్న పాలబిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మోత్కూరు మండలం ముశిపట్ల, రాజాపేట మండల కేంద్రంలో పాడిరైతులు ఆందోళనకు దిగారు. మోత్కూరు పాల శీతలీకరణ కేంద్రానికి ముశిపట్ల పాడి రైతులు తాళం వేసి ఆందోళన చేపట్టారు. రాజాపేటలో రహదారిపై రాస్తారోకో నిర్వహించి, పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

(ఆంధ్రజ్యోతి-మోత్కూరు, రాజాపేట)

క్రైం పాయింట్ Crime point

పైన ఎండు గడ్డి మోపులు.. కింద ఆవులు

● కొత్త తరహాలో ఆవుల అక్రమ రవాణా



ట్రక్కు చుట్టూ గడ్డిమోపులు, మధ్యలో కనిపించకుండా ఆవులు



భువనగిరి టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆవుల అక్రమ రవాణాదారులు ప్రతిసారి ఓ కొత్త విధానాన్ని అవలంబిస్తున్నారు. రెండు వారాల క్రితం పైన కొబ్బరి పీచు బస్తాలు దిగువన కట్టివేసిన ఆవులను అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఘటన మరువకముందే మరో మారు ఎండు గడ్డిమోపుల కింద ఆవులను దాచి రవాణా చేస్తూ బుధవారం గోరక్షకుల చేతికి చిక్కారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో ఈ సంఘటన జరిగింది. పట్టణ ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. రవాణా ట్రక్కు వాహనంలో అడుగు భాగంలో 17 ఆవులను కట్టివేసి, పైన ఎండుగడ్డి మోపులను పేర్చి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రంపచోడవరం నుంచి హైదరాబాద్‌కు అక్రమ రవాణా చేస్తున్నట్టు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు గోరక్షకులు భువనగిరి బైపాస్ రోడ్డుపై వేచిఉన్నారు. బజరంగ్‌దళ్ జిల్లా, పట్టణ కన్వీనర్లు బింగి భరత్, నవీన్ తదితరులు ద్విచక్ర వాహనాలపై ట్రక్కును అనుసరించి స్థానిక సింగన్నగూడెం చౌరస్తాలో నిలిపారు. ఎండుగడ్డి మోపుల కింద ఆవులను గురించి పట్టణ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఆవులను రాజాపేట మండలం చల్లూరు గోశాలకు తరలించామని, వాహనాన్ని సీజ్ చేసి యజమాని రాజు పత్లావత్, డ్రైవర్ మధు, క్లీనర్ కుమార్‌పై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు, జరిమానా

సూర్యాపేట క్రైం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో కోర్టు ఇద్దరికి జైలు, పలువురికి జరిమానా విధించినట్లు సూర్యాపేట ట్రాఫిక్ ఎస్‌ఐ సాయిరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3వ తేదీన సూర్యాపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 10 మంది మోతాదుకు మించి మద్యం తాగినట్లు గుర్తించామన్నారు. వారిని బుధవారం సూర్యాపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ కోర్టులో హాజరుపర్చగా జడ్జి బీవీ రమణ ఒకరికి మూడు రోజుల జైలుతో పాటు రూ.2 వేల జరిమానా, మరొకరికి ఒక రోజు జైలు శిక్షతో పాటు రూ.4 వేల జరిమానా విధించారని ఎస్‌ఐ తెలిపారు. మిగిలిన ఎనిమిది మందికి కలిపి రూ.9 వేల జరిమానా విధించారన్నారు. మద్యం తాగి వాహనాలు నడపటం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. వాహనాలు నడిపే వారు విధిగా నిబంధనలు పాటించాలన్నారు.

విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి

త్రిపురారం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం మర్రిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని పలుగు గ్రామంలో విద్యుదాఘాతంతో బుధవారం మూడు గేదెలు మృతి చెందాయి. బాధితులు రెబెల్లి సైదులు, గొల్ల ఉపేంద్ర తెలిపిన వివరాల ప్రకారం పాడి గేదెలు ఉదయం పొలంలో మేత మేస్తూ కింద పడి ఉన్న విద్యుత్ వైర్లకు తగిలాయి. దీంతో విద్యుదాఘాతానికి గురై మూడు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. రెబెల్లి సైదులుకు చెందిన రూ.2 లక్షల విలువైన రెండు గేదెలు, గొల్ల ఉపేంద్రకు చెందిన రూ.లక్ష విలువైన ఒక గేదె మృతి చెందినట్లు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.



పొలంలో గేదెల మృతదేహాలు

బైక్‌ను కారు ఢీకొని వ్యక్తి మృతి

కోదాడ రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలం చిమిర్యాల క్రాస్‌రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. కోదాడకు చెందిన కే రాఘవ(40) మండలంలోని నల్లబండగూడెం పంచాయతీ పరిధిలోని రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనుల్లో పాల్గొన్నాడు. బుధవారం సాయంత్రం తిరిగి కోదాడకు వస్తుండగా, విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు రాఘవ బైక్‌ను ఢీకొంది. దీంతో తీవ్రగాయాలై అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.



రాఘవ మృతదేహం

వాహనం ఢీకొని యాచకుడు ..

నాగార్జునసాగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీకొని యాచకుడు మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో బుధవారం తెల్లవారుజామున జరిగింది. ఎస్‌ఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం వారం రోజులుగా పైలాన్‌కాలనీలో తిరుగుతూ బిక్షాటన చేస్తున్న 70 ఏళ్ల వయస్సు గల వ్యక్తి బుధవారం నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైపాస్ రోడ్డులో స్థానికులను విచారించగా యాచకుడు హిందీ మాట్లాడేవాడని తెలిసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆనవాళ్లు తెలిసిన వారు విజయపురి సౌత్ పోలీసులకు తెలపాలని ఎస్‌ఐ కోరారు.

చెట్టు పైనుంచి పడి ...

సూర్యాపేట క్రైం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో బుధవారం జరిగింది. పట్టణ పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన నగిరె సైదులు(47) సుతారీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాలనీలోని బంధువుల నివాసంలో వేపచెట్టు కొమ్మలు కొట్టేందుకువెళ్లాడు. చెట్టు ఎక్కి కొమ్మలు తొలగించే సమయంలో ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సైదులు కుమారుడు అనిల్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌ఐ వాసా ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఇటుకులపహాడ్‌లో వృద్ధుడి అదృశ్యం

శాలిగౌరారం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ జిల్లా శాలిగౌరారం ఎస్‌ఐ సైదులు తెలిపారు. మండలంలోని ఇటుకలపహాడ్ గ్రామానికి చెందిన కుంచం రామచంద్రయ్య(69) అలియాస్ బాబు మే 15న ఇంటి నుంచి అదృశ్యమైనట్లు తెలిపారు. ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో కుమారుడు వెంకన్న ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712670178, 8712667713 నెంబర్లకు సమాచారం అందించాలని ఎస్‌ఐ సైదులు కోరారు.



రామచంద్రయ్య(ఫైల్‌ఫొటో)

బిర్యానీ ఇవ్వలేదని ఓ వ్యక్తి వీరంగం : కేసు నమోదు

సూర్యాపేట అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : బిర్యానీ కోసం హోటల్ నిర్వాహకులను బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సూర్యాపేట జిల్లా చివ్వెంల ఎస్‌ఐ మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చివ్వెంల మండలం అక్కలదేవిగూడెంలోని ఓ దాబా హోటల్‌కు మే 30వ తేదీ సాయంత్రం ఆరు గంటల సమయంలో అదేగ్రామానికి చెందిన అబ్బులుగౌడ్ తన అనుచరుడికి నాలుగు బిర్యాని ప్యాకెట్లు తెమ్మని పంపించాడు. డబ్బులు ఇచ్చి బిర్యాని తీసుకెళ్లాలని హోటల్ నిర్వాహకురాలు తెలిపింది. తాను అబ్బులుగౌడ్ మనిషినంటూ వెంటనే అతడికి ఫోన్‌చేసి విషయం చెప్పాడు. బైకుపై హోటల్‌కు వచ్చిన అబ్బులుగౌడ్ దాబా ముందు బైకును పడేసి ఆగ్రహంతో హోటల్ నిర్వాహకురాలిపై చేయి చేసుకున్నాడు. ఈ మేరకు హోటల్ నిర్వాహకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇదిలా ఉండగా అబ్బులుగౌడ్ ఎవరో నీకు తెలుసా అంటూ వీరంగం సృష్టించిన తతంగం అంతా హోటల్ సీసీ కెమెరాలో రికార్డయ్యింది.



హోటల్ నిర్వాహకులతో వాగ్వాదం చేస్తున్న అబ్బులుగౌడ్

నెల ముందుగా సాగర్‌కు కృష్ణమ్మ!


● జూరాల నుంచి శ్రీశైలానికి మొదలైన నీటి విడుదల ● గతంలో ఎన్నడూ లేనివిధంగా జూన్‌లోనే ● సాగర్ ఆయకట్టుకు జూలైలోనే

(ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్)

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఈ ఏడాది రెండు నెలల ముందుగానే కృష్ణమ్మ రానుందా? అంటే నీటిపారుదల శాఖ నిపుణులు అవుననే చెబుతున్నారు. గతంలో కృష్ణ పరివాహక ప్రాంతాల్లో జూన్‌లో వర్షాలు కురిస్తే సాగర్‌కు ఎగువన ఉన్న ప్రాజెక్టులు అన్నినిండిన తర్వాత జూలైలో సాగర్‌కు వరద రాక ప్రారంభమయ్యేది. ప్రస్తుతం సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు జూరాల నుంచి వరద రాక రెండు నెలల ముందుగానే ప్రారంభమైంది. జూరాల గరిష్ఠ నీటిమట్టం 318.81 మీటర్లు కాగా, ప్రస్తుతం 317.55 మీటర్లుగా ఉంది. దీంతో ఎగువ నుంచి వస్తున్న వరద నీటిలో 16,732 క్యూసెక్కులను దిగువన ఉన్న శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 833.90 అడుగులుగా ఉంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా జూన్‌లోనే శ్రీశైలానికి జూరాల నుంచి నీటి విడుదల ప్రారంభం కావడంతో సాగర్ ప్రాజెక్టుకు నీటి రాక ముందే వస్తుందని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే జూన్ చివరి నాటికి వరదరాక ప్రారంభం కావచ్చునని ఆయకట్టు రైతులు, ప్రాజెక్టు అధికారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ప్రస్తుత పరిస్థితి..

నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590(312.5050 టీఎంసీలు) అడుగులు కాగా ప్రస్తుతం 511.80(134.7466టీఎంసీలు)అడుగులుగా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 4,050 క్యూసెక్కులు, ఎడమ కాల్వ, వరద కాల్వ, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి ఎటువంటి నీటి విడుదల లేదు. ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 450 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 4,500 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి ఎటువంటి నీటి రాక లేదు.



నాగార్జునసాగర్‌లో బుధవారం సాయంత్రం నాటికి నీటినిల్వ

ఐదేళ్లలో ఆగస్టులోనే క్రస్ట్‌గేట్లు ఎత్తివేత

సాగర్ క్రస్ట్‌గేట్లను 2019 నుంచి 2024 వరకు ఆగస్టులోనే ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు.

ఏడాది	క్రస్ట్‌గేట్లు ఎత్తిన తేదీ	నాటి నీటిమట్టం (అడుగుల్లో)
2019	ఆగస్టు 12	588.00
2020	ఆగస్టు 21	585.40
2021	ఆగస్టు 01	587
2022	ఆగస్టు 11	585.60
2023	గేట్లు ఎత్తలేదు.	
2024	ఆగస్టు 5	585.20

ప్రతీ ఏడాది ఆగస్టులోనే ...

ప్రతీ ఏడాది సాగర్ ఎడమకాల్వ ఆయకట్టుకు ఆగస్టులోనే సాగు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు వరద రాకపోవడంతో 2023-24 వ్యవసాయ సంవత్సరాన్ని రాష్ట్ర ప్రభుత్వం క్రాప్ హాలిడేగా ప్రకటించింది. దీంతో ఆ ఏడాది సాగర్ ప్రాజెక్టు ఎడమకాల్వ ఆయకట్టులో బోర్లు, బావుల కింద సుమారు లక్ష ఎకరాలు మాత్రమే సాగు చేశారు. సాగర్ ప్రాజెక్టు పరిధిలో ఎడమ కాల్వ పరిధిలో నల్లగొండ, ఖమ్మం జిల్లాలో సాగవుతున్న ఆరు లక్షల ఎకరాలు సాగునీరు లేక పోవడంతో 2023 వ్యవసాయ సంవత్సరంలో బీళ్లుగా మారాయి. 2024-25 వ్యవసాయ సంవత్సరంలో సాగర్‌కు ఎగువ నుంచి వరద రాక జూలైలో ప్రారంభం కావడంతో ఆగస్టు 2వ తేదీ నుంచి ఎడమ కాల్వకు వానాకాలం సాగుకు నీటిని విడుదల చేశారు.

వానాకాలం సీజన్‌లో పదేళ్లలో ఎడమకాల్వకు విడుదల వివరాలు

ఏడాది	నాటి నీటిమట్టం (అడుగులు)	నీటి విడుదల తేదీ
2014	515	ఆగస్టు 6
2015	510	నీటివిడుదల లేదు
2016	514.20	ఆగస్టు 26
2017	576	అక్టోబరు 31
2018	555	ఆగస్టు 23
2019	556	ఆగస్టు 11
2020	556	ఆగస్టు 7
2021	585	ఆగస్టు 5
2022	555	ఆగస్టు 31
2023	506	క్రాప్ హాలిడే
2024	585	ఆగస్టు 2

క్లిక్ క్లిక్




శిథిలావస్థకు చేరిన పాతబస్తీలోని ప్రభుత్వ పాఠశాల భవనం

పురాతన భవనాలతో భయం భయం

నల్లగొండ పట్టణం పాతబస్తీలో 80 నుంచి 100 ఏళ్ల నాటి భవనాలు శిథిలావస్థకు చేరాయి. కొన్ని భవనాలు సగం కూలిపోయాయి. ఆయా భవనాలను పూర్తిగా నేలమట్టం చేయకపోవడంతో విషసర్పాలకు నిలయంగా మారాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత యజమానులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. 60 నుంచి 80 ఏళ్లనాటి భవనాలను తక్కువ అద్దెకి ఇస్తుండటంతో కొంతమంది అక్కడే ఉంటున్నారు. వర్షాకాలం సమీపించడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.


ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ



పాతబస్తీలో 75 ఏళ్ల నాటి పాత భవనం



గంజ్‌లోని చౌరస్తాలోని పాత భవనం



100 ఏళ్ల నాటి షేర్ బంగ్లా



అధికారులతో సమీక్షలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కలెక్టర్ హనుమంతరావు, ఈవో వెంకటరావు

రూ.230 కోట్ల ప్రతిపాదనలతో
అభివృద్ధి పనుల నివేదిక

సీఎంకు తిర్మలాపురం సభలో అందజేస్తాం : విప్ బీర్ల

యాదగిరిగుట్ట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నృసింహస్వామి దర్శనార్థం దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులకు కొండపైన సదుపాయాల కోసం రూ.230 కోట్ల ప్రతిపాదనలను సీఎం రేవంత్‌రెడ్డికి అందజేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. కలెక్టర్ హనుమంతరావు, దేవాదాయ శాఖ కమిషనర్, ఈవో వెంకట్రావుతో కలిసి బుధవారం యాదగిరికొండపైన బుధవారం సమావేశమయ్యారు. వేద పాఠశాల, కొండపైన బాలాలయ ప్రదేశంలో కల్యాణ మండపం, కళావేదిక నిర్మాణం, షాపింగ్ కాంప్లెక్స్, మల్టీలెవల్ వాహనాల పార్కింగ్, గదులు నిర్మాణం, సౌర విద్యుత్, అసంపూర్తి బ్రిడ్జి తదితరాలపై సమీక్ష నిర్వహించిన అనంతరం విప్ మాట్లాడారు. కొండపైన భక్తులకు కావల్సిన సదుపాయాల కోసం రూ.230 కోట్ల అభివృద్ధి పనులు నివేదికను ఈవో తయారు చేశారన్నారు. తుర్కపల్లి మండలం తిర్మలాపురంలో ఈ నెల 6న జరిగే సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నివేదికను అందజేస్తామన్నారు. సీఎం ఆదేశాల మేరకు అభివృద్ధి పనులను ప్రారంభిస్తామన్నారు. తిరుమల తరహాలో యాదగిరిగుట్టను అభివృద్ధి చేయాలన్నది సీఎం లక్ష్యమన్నారు. ఆలయానికి పాలక మండలిని నియమించేందుకు సీఎం నేతృత్వంలో శరవేగంగా కసరత్తు జరుగుతోందన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్లు భాస్కర్‌రావు, వీరారెడ్డి, భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, డీఆర్‌డీవో పీడీ నాగిరెడ్డి, ఆలయ అధికారులు దోర్బల భాస్కర శర్మ, జిల్లెల దయాకర్ రెడ్డి, ఊడెపు వెంకటరామారావు, జిల్లా, ఆలయ యంత్రాంగం పాల్గొన్నారు.

వీధివ్యాపారులకో వీధి

మిర్యాలగూడలో ఏర్పాటుకు ప్రయత్నాలు





మునిసిపల్ కాంప్లెక్స్ వద్ద రోడ్డు వెంట విక్రయాలు కొనసాగిస్తున్న వీధివ్యాపారులు, మార్కెట్ ఏర్పాటుకు ప్రతిపాదించిన ఫ్లైఓవర్ ప్రాంతం

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో వీధి వ్యాపారులకు ప్రత్యేకంగా ఓ వీధిని ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. వ్యాపారకేంద్రమైన మిర్యాలగూడ పట్టణంలో రద్దీ పెరుగుతుండటంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అన్నివర్గాల నుంచి అభిప్రాయాలు సేకరించిన అనంతరం సబ్‌కలెక్టర్, ఎమ్మెల్యే, మునిసిపల్ కమిషనర్, పోలీస్ యంత్రాంగం పట్టణంలో ప్రణాళిక రూపొందించి అమలు చేసేందుకు సన్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ)

మిర్యాలగూడ పట్టణంలో ఏకైక వాణిజ్య కూడలిగా కొనసాగుతున్న సాగర్‌రోడ్డులో తరచుగా ట్రాఫిక్ రద్దీ నెలకొంటుంది. దానిని నివారించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కొంత మేరకు రోడ్డు విస్తరణ జరిగినా వీధివ్యాపారులు తోపుడుబండ్లను రోడ్డుపక్కనే ఏర్పాటుచేసుకుని వ్యాపారాలు కొనసాగించడం, ద్విచక్రవాహనాలు రోడ్డుపైనే నిలుపుతుండటంతో రోడ్డు మూసుకపోయి ఇరుకుగా మారి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్న అభిప్రాయం వ్యక్తమౌతోంది. ఈ క్రమంలో ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తూ తోపుడుబండ్లను పేవ్‌మెంట్ పక్కనున్న డ్రైనేజీపైకి జరిపి విక్రయాలు చేసుకోవాలని ట్రాఫిక్ పోలీస్, మునిసిపల్ అధికారులు వీధివ్యాపారులకు సూచిస్తూ వచ్చారు. కాగా డ్రైనేజిపైకి పండ్ల బండలను జరపడంతో మెయిన్‌రోడ్డు పక్కనున్న షాపులకు తోపుడు బండ్లు అడ్డంగా ఉండి గిరాకీ దెబ్బతింటుందని దుకాణయజమానులు పోలీసులకు ఫిర్యాదులు చేస్తూ వస్తున్నారు. దీంతో సమస్య మొదటికి వస్తోందని అధికారులు తలలపట్టుకుంటున్నారు. మరోవైపు డ్రైనేజీపై పాదచారులు నడవడానికి అవకాశం లేకుండా పోతోందంటున్నారు. ఈ క్రమంలో ట్రాఫిక్ శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికకు రూపొందిస్తున్నట్లు సమాచారం.

263 మంది వీధి వ్యాపారులు

వ్యాపారకేంద్రంగా ఉన్న సాగర్‌రోడ్డులో రాజీవ్‌చౌక్ నుంచి రైల్వేట్రాక్ వరకు 262 మంది రోడ్డు పక్కన తోపుడుబండ్లను ఏర్పాటుచేసుకుని చిరువ్యాపారాలు చేసుకుంటున్నట్లు మునిసిపల్ అధికారులు నివేదిక రూపొందించారు. మొత్తం పట్టణంలో 48 వార్డుల్లో 8,327 మంది స్ట్రీట్ వెండర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలుస్తోంది. వీరిలో వీధివ్యాపారులుగా మొదటి విడతలో 4,460 మంది రూ.10వేల రుణాలు, రెండవ విడతలో 1,748 మంది రూ.20 వేలు, మూడవ విడతలో 719 మంది రూ.50 వేల రుణాలు పొందినట్లు తెలుస్తోంది. కాగా సాగర్‌రోడ్డులోని 263 మందికి ప్రత్యేకంగా వాణిజ్య వీధిని ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చేయవచ్చునని అధికారులు భావిస్తున్నారు.

ఫ్లైఓవర్ కింద ప్రత్యేక ఏర్పాట్లు

టీఎఫ్‌ఐడీసీ కింద 2021లో ఫ్లైఓవర్ బ్యూటీషన్‌కు రూ.3 కోట్లు మంజూరైనట్లు సమాచారం. ఆ నిధులు వెచ్చించి వీధివ్యాపారుల విక్రయాలకు ప్రత్యేక వీధిని ఏర్పాటు చేసేందుకు మునిసిపల్ అధికారులు చర్యలు చేడుతున్నట్లు తెలుస్తోంది. ఫ్లైఓవర్ కింద ఒక వైపున వాహనాల పార్కింగ్‌కు మరో వైపున పండ్లు, కాయగూరలు, ఇతర విక్రయాలు కొనసాగించుకునేలా ఏర్పాట్లు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం. ఫ్లైఓవర్ కింద నుంచి ప్రయాణించే వాహనాలకు రాకపోకలకు అనువుగా విభజించి పైనుంచి కురిసే వర్షపునీరు వెళ్లడానికి కింద డ్రైన్ ఏర్పాటు చేసి గ్రిల్స్ అమర్చి, లైట్లు, సర్వీస్‌రోడ్డు సౌకర్యం కల్పించేలా ప్రణాళికను రూపొందిస్తున్నారు. చిరు వ్యాపారాలకు అనువైన మరో రెండు చోట్లను గుర్తించి అందరికీ అక్కడికి తరలించి పునరావాసం కల్పించడం ద్వారా పూర్తి స్థాయిలో ట్రాఫిక్ నియంత్రణ చేయవచ్చన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యామ్నాయ మార్గాలు పరిశీలిస్తున్నాం



సాగర్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నాం. ప్రజాప్రతినిధులు, పోలీస్, మునిసిపల్ శాఖ సమన్వయంతో వీధి వ్యాపారుల, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయంపై దృష్టి సారించాం. ఫ్లైఓవర్ కింది ప్రాంతాన్ని వాణిజ్యవీధిగా అభివృద్ధి చేసేందుకు అన్ని అంశాలను పరిశీలిస్తున్నాం. అదేవిధంగా మరో రెండు చోట్లను కూడా పరిశీలిస్తున్నాం.

ఎండీ యూసుఫ్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ

కాల్వ మట్టి కాజేస్తున్నారు..

- ● దండెంపల్లిలో మట్టి మాఫియా ఆగడాలు
- ● టిప్పర్ వాహనాల్లో యథేచ్ఛగా తరలింపు
- ● పట్టించుకోని నీటిపారుదల శాఖ అధికారులు



కాల్వ మట్టిని తరలిస్తున్న టిప్పర్ వాహనాలు, ట్రాక్టర్లు



అది బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టుకు సంబంధించిన కాల్వ.. నల్లగొండ జిల్లా నల్లగొండ మండలంలోని దండెంపల్లి గ్రామ శివారు నుంచి వెళ్తుంది. ఆ కాల్వ మట్టిపై మాఫియా కన్ను పడింది. ఇంకేముంది టిప్పర్ వాహనాల ద్వారా కాల్వ మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. అడ్డూ అదుపు లేకుండా ఈ వ్యవహారం జరుగుతున్నా నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి.

● (ఆంధ్రజ్యోతి, నల్లగొండ)

రోజుకు పదుల సంఖ్యలో టిప్పర్లు అటు కట్టంగూరు మండలంలోని పిట్టంపల్లి గ్రామం నుంచి, ఇటూ నల్లగొండ మండలం దండెంపల్లి గ్రామం నుంచి మట్టి తరలిస్తున్నారు. ఇప్పటికే నల్లగొండ చుట్టూ పక్కల కొండలు, చెరువులు, గుట్టల మట్టి తరలిస్తున్న మాఫియాకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఈ మాఫియాకు బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు కాల్వ వరంలా మారింది. స్థానికులు ప్రశ్నిస్తే వారిని బెదిరిస్తున్నట్లు సమాచారం. ఒక్క టిప్పర్ మట్టిని పట్టణ ప్రాంతాల్లో రూ.4500లకు వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని తెలుస్తోంది. నీటిపారుదల శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందనే విమర్శలు ఉన్నాయి. టిప్పర్లు, ట్రాక్టర్లతో అక్రమంగా తరలిస్తున్న మట్టిని పలు వెంచర్లు, నూతనంగా నిర్మాణాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కొన్నాళ్లుగా ఈ దందా కొనసాగుతున్నా అధికార యంత్రాంగం స్పందించడం లేదు.

కాల్వ పటిష్టత ప్రశ్నార్థకం

బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టడంతో పాటు కాల్వ పనులు త్వరితగతిన పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఉంది. కొన్ని నెలల క్రితమే చాలా వరకు బి.వెల్లంల ప్రాజెక్టు పనులు నల్లగొండ మండలం దండెంపల్లి గ్రామాన్ని దాటాయి. అయితే అక్రమార్కులు ఈ కాల్వ వెంటఉన్న మట్టి తరలిస్తుండడంతో కాల్వ పటిష్టత ప్రశ్నార్థకంగా మారింది. గతంలోనే కొంతమంది వ్యాపారులు ఆ గ్రామంలో భూములను కొనుగోలు చేసి తమ భూముల నుంచి బి.వెల్లంల కాల్వ వెళ్లకుండా, తమ భూములు నష్టపోకుండా ఉండేలా కాల్వ డిజైన్‌నే మార్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పెద్దఎత్తున మట్టి కాల్వ తరలించడంతో నీటి విడుదల తర్వాత కాల్వ కుంగిపోయే అవకాశాలు ఉంటాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక రైతులు పలుమార్లు నీటిపారుదల శాఖ అధికారులకు ఫోన్లు చేసినా స్పందించక పోవడం, స్వయంగా కలిసి అధికారులకు విన్నవించినా కనీసం స్పందించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లు, ట్రాక్టర్లు తీసుకొచ్చి మట్టిని పెద్దఎత్తున తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే ఈ తంతాగానికి పాల్పడుతున్నారు. ఈ మాఫియా గతంలోనూ నల్లగొండ చుట్టు పక్కల చెరువులు, కొండలు, గుట్టలు అనే తేడా లేకుండా మట్టి తరలించారనే ఆరోపణలు ఉన్నాయి.



రైతుల పొలాలనూ వదలని వైనం

భారీ వాహనాలు కాల్వ కట్టతో పాటు పొలాల్లో తిరుగుతుండడంతో స్థానికంగా రైతులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. కాల్వ మట్టినే కాకుండా పొలాల్లోని మట్టిని కూడా లోతుగా తవ్వుతున్నట్లు ఆరోపణలున్నాయి. మొరంతో పాటు కొన్నిచోట్ల ఎర్రమట్టి కూడా ఉండడంతో ఆ మట్టి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పొలాల్లో రైతులకు సంబంధించిన పైపులైన్‌లు పగిలి పోవడంతో రైతులు మరమ్మతులు చేసుకొని ఆర్థిక భారం మోస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్నట్లు సమాచారం. విలువైన మట్టి తరలించడంతో భూసారం తగ్గి, నీటి నిల్వలు అడుగంటి పోయే ప్రమాదం ఉంది. పట్టా భూముల్లో సైతం మట్టి తవ్వుతున్నట్లు స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై స్థానిక నీటిపారుదల శాఖ ఈఈ, డీఈలను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరడానికి ప్రయత్నించి నప్పటికీ ఫోన్ ఎత్తడం లేదు. తక్షణమే తరలింపును నిలిపివేయకుంటే ఆందోళన చేస్తామని స్థానిక రైతులు శ్రీనివాస్, లింగయ్య, రమేష్, లక్ష్మయ్య స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా మట్టి తరలింపును నిలిపివేసి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	511.80 అడుగులు
టీఎంసీలు	134.7466
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	4,050
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	450 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	4,500 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	25.10 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	640.10 అడుగులు
టీఎంసీలు	3.24
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	357. 40క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	76.40 క్యూసెక్కులు

క్రీడలతో మానసికోల్లాసం : ఎమ్మెల్యే వీరేశం



రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, జూన్ 4, (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద చేస్తాయని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలంలోని మంగళపల్లి గ్రామ హైస్కూల్‌లో 47వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ బాల బాలికల హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలను బుధవారం ప్రారంభించారు. మారుమూల గ్రామమైన మంగళపల్లిలో రాష్ట్రస్థాయి క్రీడలను నిర్వహించడం అభినందనీయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి క్రీడాకారులను ప్రోత్సహిస్తూ క్రీడా నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాముల పవన్ కుమార్, అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ. ఉస్మాన్, చింతకాయల పుల్లయ్య, హెచ్ఎం కర్రా వీరారెడ్డి, ట్రస్మా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కందాళ పాపిరెడ్డి, మాజీ ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగాధర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, చింతల ముత్తయ్య, డాక్టర్ కృష్ణమాచారి, ప్రకాష్‌రావు, మునీందర్‌రావు పాల్గొన్నారు.

ఎన్జీ కళాశాల డిగ్రీ ఫైనల్ ఇయర్ ఫలితాలు విడుదల

నల్లగొండ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాకేంద్రంలోని ఎన్జీ కళాశాల డిగ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సర తుది ఫలితాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ బుధవారం విడుదల చేశారు. కళాశాలలో జరిగిన 2,4,6 సెమిస్టర్ల ఫలితాలపై సమీక్ష సమావేశం నిర్వహించిన అనంతరం ఫలితాలు ప్రకటించారు. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం నియంత్రణ అధికారి జి. ఉపేందర్ పరీక్షల సరళిని సమీక్షించారు. బీబీఏ, బీకాం విభాగాల్లో 87శాతం, బీఎస్సీ(ఫిజికల్, లైఫ్‌సైన్స్) రెండో, నాలుగో సెమిస్టర్‌లో అత్యల్పంగా 17శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. చివరి సంవత్సరం పూర్తిచేసిన విద్యార్థుల్లో బీబీఏ 83శాతం, బీకాంలో 80శాతం, బీఏ, లైఫ్ సైన్స్‌లో 69శాతం ఉత్తీర్ణత సాధించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పరంగి రవికుమార్, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి ప్రసన్నకుమార్, అధ్యాపకులు కోటయ్య, చంద్రయ్య, నాగరాజు, రమణ, బత్తిని నాగరాజు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఉపన్యాస పోటీలకు ఎంపిక



సాయిమాధురి

సూర్యాపేటఅర్బన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ, ప్రేరణ స్వచ్ఛంద సంస్థ గుజరాత్ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి ప్రేరణోత్సవ పోటీలకు జిల్లాకేంద్రంలోని ఇమాం పేట మోడల్ స్కూల్ విద్యార్థిని అనుముల సాయి మాధురి ఎంపికైంది. నాలుగు నెలల క్రితం సూర్యా పేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో సాయి మాధురి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని ప్రేరణ ఆ సంస్థ కోఆర్డినేటర్ ప్రజాపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 20మంది విద్యార్థులు ఎంపికకాగా సూర్యాపేట జిల్లాకేంద్రం నుంచి అనుముల సాయి మాధురి ఎంపికైందని ఇమాంపేట మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



లక్ష్మీనరసింహ స్వామి నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామి అమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులు, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకించారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవారిని అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజ వాహన సేవలో ఊరేగించి విష్వక్సేనుడి తొలి పూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అలంకార వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. కొండపై శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామికి రుద్రహవనం నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 22,04,444ల ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీ నృసింహుని క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహుడి నిత్య కల్యాణాన్ని వేదపండితులు బుధవారం వైభవంగా నిర్వహించారు. రాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత భక్తవత్సలునికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం ఆర్జిత కైంకర్యాలు జరిగాయి. ఉదయం హోమాధికాలు నిర్వహించారు. కల్యాణ మూర్తులను పరిణయోత్సవ వేదికపైకి వేంచేయించి పుణ్యాహవాచనం నిర్వహించారు. పాదప్రక్షాళనం మధుపర్క పూజలు యాథావిధిగా చేపట్టారు. మంగళ్యధారణ, యజ్ఞోపవీత ధారణలు అనంతరం దివ్యమూర్తులకు గరుడోత్సవం జరిగింది. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్వాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్ పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ ఇండియా జట్టుకు విహారెడ్డి



మిర్యాలగూడ టౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం గారకుంటపాలెం గ్రామానికి చెందిన జొన్నలగడ్డ విహారెడ్డి బాస్కెట్ బాల్ ఇండియా జట్టుకు ఎంపికైంది. విహారెడ్డి హైదరాబాద్‌లో పదో తరగతి చదువుతోంది. ఇటీవల అసోంలో జరిగిన అండర్-16 పోటీల్లో ప్రతిభ కనబర్చి ఏషియన్ గేమ్స్‌లో పాల్గొనే ఇండియా జట్టుకు ఎంపికైంది. ఈ నెల 12 నుంచి మాల్దీవ్స్‌లో జరగనున్న బాస్కెట్‌బాల్ ఏషియన్ గేమ్స్‌లో భారత జట్టు తరుపున అండర్- 16 విభాగంలో ఆడనుంది. ఇండియా జట్టుకు ఎంపికైన విహారెడ్డిని పలువురు అభినందించారు.

యువ వికాసం కాంగ్రెస్ కార్యకర్తలకేనా : సంకినేని

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వరరావు

మోత్కూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస పథకం కాంగ్రెస్ కార్యకర్తల పునరావాసానికేనని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు ఆరోపించారు. యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు ఆర్యవైశ్య భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారన్నారు. కేసీఆర్ కుటుంబంలో ఆధిపత్య పోరు తీవ్రమైందన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో 54 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీకే అత్యధికంగా ఓట్లు వచ్చాయన్నారు. దీంతో ప్రజలు ఎవరి పాలన కోరుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చన్నారు. 76 ఏళ్ల స్వతంత్ర భారతంలో 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ చేయనంత అభివృద్ధిని ప్రధాని మోదీ 11 ఏళ్లలో చేసి చూపారన్నారు. 15, 19 స్థానాల్లో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థను 4వ స్థానానికి తీసుకెళ్లారన్నారు. ఆహార ఉత్పత్తులు, ఇతర వస్తువులు, పరికరాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకునే స్థాయినుంచి ఆ దేశాలకు ఎగుమతి స్థాయికి తీసుకెళ్లారన్నారు. రక్షణరంగంలో తి రుగులేని పటిష్టత, బలం సాధించారన్నారు. కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా కోశాధికారి గుజ్జ సోమనర్సయ్య, నియోజకవర్గ కోకన్వీనర్ కూరాకుల వెంకన్న, పట్టణ అధ్యక్షురాలు చాడ మంజుల, నాయ కులు కొణతం నాగార్జునరెడ్డి, పోచం సోమయ్య, గౌరు శ్రీనివాస్, ఏనుగు జితేందర్‌రెడ్డి, ముత్తినేని తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

పోచంపల్లిలో ఫ్యాషన్ విద్యార్థుల సందడి



చేనేత మగ్గంపై వస్త్ర తయారీని పరిశీలిస్తున్న ఫ్యాషన్ కళాశాల విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని రూట్స్ కాలేజీ ఆఫ్ ఫ్యాషన్ అండ్ ఇంటీరియల్ కాలేజీకి చెందిన 30 మంది ఫ్యాషన్ విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా బుధవారం భూదాన్‌పోచంపల్లి సందర్శించారు. ఈ సందర్భంగా పట్టణంలోని రూరల్ టూరిజం పార్కులోని చేనేత మ్యూజియంతోపాటు చేనేత కళా నైపుణ్యాన్ని పరిశీలించారు. అనంతరం చేనేత కార్మికుల గృహాలను సందర్శించి చేనేత ప్రక్రియను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కాలేజీ చైర్మన్ హబీబ్ పడాల మాట్లాడుతూ చేనేత రంగానికి సంబంధించిన స్టడీ టూర్‌లో భాగంగా పోచంపల్లిని సందర్శించామని తెలిపారు. ఇక్కడి కార్మికుల రూపొందిస్తున్న చేనేత వస్త్ర కళానైపుణ్యం అద్భుతంగా ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ఫ్యాకల్టీ మోహన్‌శ్రీ, కావ్య, అంకిత, ఉష తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫెయిలైన విద్యార్థులకు వన్‌టైమ్ ఆఫర్

భువనగిరి టౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): డిగ్రీ ఫెయిల్ అయిన విద్యార్థులకు ఉస్మానియా యూనివర్సిటీ వన్‌టైమ్ ఆఫర్ ప్రకటించింది. మూడు సంవత్సరాల డిగ్రీ (నాన్ సెమిస్టర్) కోర్సులో తప్పిన పూర్వ విద్యార్థులు మళ్లీ పరీక్ష రాసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. 2000-2015 మధ్య బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ కోర్సులు చదివి పలు కారణాలతో ఫెయిల్ అయి డిగ్రీ పట్టాకు దూరమైన పూర్వ విద్యార్థుల డిగ్రీ కల నెరవేర్చేందుకు యూనివర్సిటీ మరోసారి వన్‌టైం ఛాన్స్ ఇచ్చింది. నిర్దేశిత విద్యా సంవత్సరాల్లో ఫెయిలైన విద్యార్థులు జూన్ 17 వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని అధికారులు సూచించారు. రూ.500 అపరాధ రుసుముతో జూన్ 20 నుంచి 24వ తేదీ వరకు ఆయా కాలేజీల్లో ఫీజు చెల్లించవచ్చు. 2015-16 విద్యా సంవత్సరం సిలబస్ ప్రకారం పరీక్షలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఉస్మానియా వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 100 మంది వరకు విద్యార్థులు ఓయూ వన్‌టైం ఛాన్స్‌కు అర్హులని డిగ్రీ కళాశాలల నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఓయూ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని డిగ్రీ కలను నెరవేర్చుకోవాలని విద్యా వేత్తలు సూచిస్తున్నారు.

పుట్టెడు దుఃఖంలోనూ సామాజిక బాధ్యత

హెడ్‌కానిస్టేబుల్ సైదులుగౌడ్ నేత్రాలు దానం చేసిన కుటుంబసభ్యులు



సైదులుగౌడ్(ఫైల్)

కనగల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): పుట్టెడు దుఃఖంలో ఉన్నా ఆ కుటుంబం సామాజిక బాధ్యత మరువలేదు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కనగల్ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ బొల్లపెల్లి సైదులుగౌడ్(47) నేత్రాలను ఆయన కుటుంబ సభ్యులు నల్లగొండ లయన్స్ క్లబ్ ఆఫ్ చారిటబుల్ ట్రస్ట్‌కు దానం చేశారు. నేత్రదానానికి సైదులు కుటుంబసభ్యులను ఎస్ఐ విష్ణుమూర్తి ఒప్పించారు. పుట్టెడు దుఃఖంలోనూ నేత్రదానానికి ఒప్పుకున్న సైదులుగౌడ్ కుటుంబసభ్యులను ఎస్ఐ ప్రశంసించారు. హెడ్‌కానిస్టేబుల్ సైదులుగౌడ్ నేత్రాలను దానం చేసి కుటుంబసభ్యులు ఆదర్శంగా నిలిచారని చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు కొనియాడారు.

పాల శీతలీకరణ కేంద్రానికి తాళం

- ● మోత్కూరులో పాడి రైతుల ఆందోళన
- ● మూడు నెలలుగా పాల బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన



మోత్కూరు పాల శీతలీకరణ కేంద్రానికి తాళం వేసి ధర్నా చేస్తున్న ముశిపట్ల పాడి రైతులు

మోత్కూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం ముశిపట్ల గ్రామానికి చెందిన పాడి రైతులు మోత్కూరు పాల శీతలీకరణ కేంద్రానికి బుధవారం తాళం వేశారు. ప్రతి 15 రోజులకోసారి బిల్లు చెల్లించాల్సి ఉండగా మూడు నెలలుగా చెల్లించడం లేదని కేంద్రం ఎదుట ఆందోళన చేశారు. ఆరు బిల్లులు రూ7.20లక్షలు చెల్లించాల్సి ఉందని రైతులు చెప్పారు. పాల బిల్లు రాగానే ఇస్తామంటే తమకు దుకాణాల్లో అరువు(ఉద్దెర) కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పశువుల దాణా తెచ్చుకోవడానికి కూడా డబ్బులు లేవన్నారు. పశువులకు దాణా పెట్టకుంటే అవి పాలు ఎలా ఇస్తాయని ప్రశ్నించారు. రైతులు పాల శీతలీకరణ కేంద్రానికి తాళం వేసి ధర్నా చేస్తుండగా గ్రామాల నుంచి సేకరించిన పాలు తీసుకుని మూడు పాల వ్యాన్లు వచ్చాయి. వాటిని రైతులు లోనికి వెళ్లనివ్వలేదు. గంట సేపట్లో వాటిని కేంద్రంలో చిల్లింగ్ చేయకుంటే చెడిపోతాయని కేంద్రం సిబ్బంది బతిమిలాడినా రైతులు తాళం తీయలేదు. మేనేజర్ అందుబాటులో లేరని, తాము సమాచారం ఇచ్చామని, ఇంటి వద్ద నుంచి వస్తున్నారని సిబ్బంది తెలిపారు. వ్యాన్లు లోనికి పంపాక మళ్లీ గేటు మూసి ఆందోళన కొనసాగించారు. మేనేజర్ వచ్చి ఒక బిల్లు (15రోజులవి) ఇస్తానంటే ఒప్పుకోలేదు. రెండు రోజుల్లో ఒక నెల బిల్లు (రెండు బిల్లులు) ఇస్తానని ఆయన హామీ ఇవ్వడం, మోత్కూరు ప్రాంతానికి చెందిన మదర్ డెయిరీ డైరెక్టర్ రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి కూడా ఫోన్ చేసి రెండు బిల్లులు ఇప్పిస్తానని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో పాల సంఘం చైర్మన్ పైళ్ల పెద్ద కవిత, వల్లపు అంతయ్య. పైళ్ల చినవెంకట్‌రెడ్డి, పైళ్ల సత్తిరెడ్డి, గనగాని నర్సింహ, పైళ్ల పాపిరెడ్డి, తండ వీరస్వామి, కందాల యాదయ్య, జిట్ట కిష్టయ్య, ముప్ప వీరారెడ్డి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఫోన్‌లో మదర్‌డెయిరీ చైర్మన్, పాడి రైతు వాగ్వాదం



పాల శీతలీకరణ కేంద్రానికి తాళం వేసి రైతులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకుని మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి రైతులకు ఫోన్ చేశారు. పాడి రైతు వల్లపు అంతయ్యను ఏం తమాషా చేస్తున్నావా అని చైర్మన్ మధుసూదన్‌రెడ్డి దబాయించగా, నీకు చేతకాకపోతే పక్కకు తప్పుకో అంటూ రైతు ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో వారిద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది.

రాజాపేటలో పాడి రైతుల రాస్తారోకో

రాజాపేట: పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలకేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రం రోడ్డుపై పాడి రైతులు బుధవారం రాస్తారోకో చేశారు. లీటర్లకు రూ.4ల ఇన్సెంటివ్ చెల్లించాలని, ప్రైవేట్ డెయిరీని అరికట్టి, మదర్ డెయిరీ కాపాడాలని నినాదాలు చేశారు. అనంతరం పాలశీతలీకరణ మేనేజర్ శేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ నెల 6న తుర్కపల్లిలో ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేయనున్నట్లు పలువురు చైర్మన్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలసంఘం చైర్మన్లు సందెల భాస్కర్‌గౌడ్, రామిడి బాపురెడ్డి, చింతలపూరి వెంకటరామిరెడ్డి, శీలం మల్లారెడ్డి, ఉపేందర్, బాలరాజిరెడ్డి, భూపాల్, దశరథ, సోమయ్య పాల్గొన్నారు.



రాజాపేటలో రాస్తారోకో చేస్తున్న పాడి రైతులు

వేంకటేశ్వరస్వామికి శేషశయన పూజలు

భువనగిరి టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామికి బుధవారం శేషశయన పూజలు నిర్వహించారు. సంప్రదాయ రీతిలో నిత్యపూజలు, గోదాదేవి, పద్మావతి సహిత వేంకటేశ్వరస్వామి నిత్య కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి విశిష్ట పూజలు నిర్వహించారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడిని జయజయ ధ్వనుల నడుమ వీధులలో ఊరేగించారు. వేలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించి అన్నప్రసాదాలు స్వీకరించారు.

విగ్రహాల ఊరేగింపు నేడు

మోత్కూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రతిష్ఠించనున్న ధ్వజ స్తంభం, నవ గ్రహాలు, వీరభద్రుడు, కాల భైరవ, పార్వతి, జంట నాగుల విగ్రహాలను ఈనెల 5న ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం వరకు పట్టణ ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుండగోని రామచంద్రు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

సీఎం పర్యటనకు సర్వం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదరం రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి హాజరుకానున్నారు.

సీఎం శంకుస్థాపన చేయనున్న పనులివే..

కార్యక్రమం	నిధులు
● గంధమల్ల రిజర్వాయర్ (1.41టీఎంసీలు)	రూ. 700 కోట్లు
● ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్	రూ. 200 కోట్లు
● యాదగిరిగుట్టలో మెడికల్ కళాశాల	రూ. 180 కోట్లు
● యాదగిరిగుట్టలో వేద పాఠశాల	రూ. 25కోట్లు
● దాతర్‌పల్లిలో వేర్‌హౌస్ గోదాములు	రూ. 15కోట్లు
● సీఆర్ఆర్, ఎంఆర్ఆర్ రోడ్లు	రూ. 30కోట్లు
● యాదగిరిగుట్టలో టెంపుల్ అభివృద్ధి	రూ. 100కోట్లు
● కొలనుపాక, కాల్వపల్లి హైలెవల్ బ్రిడ్జిలు	రూ. 14.50కోట్లు
● నియోజక వర్గంలో ఆర్అండ్‌బీ రోడ్లు	రూ. 50కోట్లు
● మోటకొండూరు మండల కేంద్రంలో ఎంపీడీవో, తహసీల్దార్, పోలీస్ స్టేషన్ భవన నిర్మాణాలకు రూ.10కోట్లు	

ఒకే చోట శిలాఫలకాల ఆవిష్కరణ

ఈ నెల 6న బహిరంగ సభలో పాల్గొనడానికి ముందుగా నియోజవర్గంలో సుమారు రూ.1500 కోట్లతో చేపట్టబోయే పలు అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఒకే చోట ఆవిష్కరించనున్నారు. శిలాఫలకాల ఏర్పాటుకు సంబంధించిన స్థలాన్ని అధికారుల పర్యవేక్షణలో చదును చేస్తున్నారు.

సీఎం సభకు పటిష్టమైన బందోబస్తు

మండలంలోని తిర్మలాపూర్‌లో నిర్వహించే సీఎం బహిరంగ సభ కు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన తుర్కపల్లి మండలంలోని తిర్మలాపూర్‌లో సీఎం సభాస్థలిని, షెడ్ల నిర్మాణం, హెలీప్యాడ్, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం బహిరంగ సభకు కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు. సభను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశామని, సభ ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలన్నారు. కాగా ఐదుగురు డీసీపీలు, 12 మంది అదనపు డీసీపీలు, 20 మంది ఏసీపీలు, సీఐలు 50మంది, ఎస్ఐలు 150 మంది, ట్రాఫిక్, సివిల్, సీఆర్‌పీఎఫ్‌తోపాటు మొత్తం 1500 మంది పోలీస్‌లు బందోబస్తు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం గంధమల్ల చెరువును పరిశీలించారు. ఆయన వెంట భువనగిరి డీసీపీ ఆకాంక్ష్‌యాదవ్, ట్రాఫిక్ డీసీపీ మల్లారెడ్డి, అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, వినోద్‌కుమార్, యాదగిరిగుట్ట, భువనగిరి ఏసీపీలు శ్రీనివాస్‌నాయుడు, రాహుల్ రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి, సీఐలు శంకర్ గౌడ్, యెలగొండ కృష్ణ, ఎస్ఐ తక్యుద్దీన్, ట్రాఫిక్ ఎస్ఐ దేవేందర్ తదితరులు ఉన్నారు.

'ఆలేరు' ప్రజల చిరకాల వాంఛ

నెరవేరబోతోంది

(5వ పేజీ తరువాయి)

స్కూల్, యాదగిరిగుట్ట పట్టణంలో రూ.183 కోట్లతో మెడికల్ కళాశాల, యాదగిరిగుట్ట టెంపుల్ అభివృద్ధి పనులకు రూ.100కోట్లు, దాతరుపల్లి గ్రామంలో రూ.48.75కోట్లతో గోదాములు, యాదగిరిగుట్టలో రూ.46కోట్లతో వేదపాఠశాల, రూ.50కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణ పనులు, రూ.14.50కోట్లతో కొలనుపాక, కాల్వపల్లి హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం, రూ.10కోట్లతో మోటకొండూర్ ఎంపీపీ, తహసీల్దార్, పోలీస్‌స్టేషన్‌ల నిర్మాణం మొత్తం రూ.1500కోట్లతో పలు పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తుర్కపల్లి మండలం తిర్మలాపురం గ్రామంలో సామూహిక శిలాఫలకాలకు శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు పూర్తి సహకారంతో ఆలేరును రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. తిరుపతి తరహాలో యాదగిరిగుట్టను సీఎం సహకారంతో తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. తిర్మలాపురంలో సీఎం సభకు నియోజకవర్గంలోని ఒక్కో మండలం నుంచి వెయ్యి బైక్‌లు, 300 కార్లు చొప్పున కార్యకర్తలు నాయకులు స్వాగతం పలుకుతారని, సభకు 50వేల జనసమీకరణ చేస్తున్నామని ఇప్పటికే సభా స్థలి వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు. సీఎం పర్యటనకు సంబంధించిన వివరాలను బీర్ల అయిలయ్య వివరించారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్యమహేందర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ గుట్ట అధ్యక్షుడు ఈరసారపు యాదగిరిగౌడ్, గుట్ట, ఆలేరు మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, అశోక్, పార్టీ మండల అధ్యక్షుడు బాలరాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

సీఎం పర్యటన సాగుతుందిలా..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 6న మధ్యాహ్నం మూడు గంటలకు హెలీక్యాప్టర్ ద్వారా 3గంటల 5 నిమిషాలకు చేరుకుంటారు.

- 3.7గంటలకు సీఎంకు పూర్ణాహుతితో స్వాగతం పలుకుతారు.
- 3.8గంటల నుంచి 3.20గంటల వరకు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- 3.22గంటలకు వేదిక వద్దకు చేరుకుంటారు. ● 3.25 గంటలకు జ్యోతి ప్రజ్వలన ● 3.27 గంటలకు జాతీయ గీతాలాపన ● 3.30గంటలకు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య స్వాగతం పలుకుతారు.
- 3.45 గంటలకు మంత్రుల ప్రసంగం
- 4గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తారు.
- సాయంత్రం 5గంటలకు తిరుగు ప్రయాణం చేస్తారు.

పచ్చిరొట్టతో భూమికి అధిక పోషకాలు

తుర్కపల్లి, భువనగిరి రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): వరి సాగుకు ముందు పొలంలో పచ్చిరొట్ట పైర్ల పెంపకాన్ని చేపట్టి తక్కువ ఖర్చుతో భూమికి అధిక పోషకాలు అందించవచ్చునని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ అరుణ కుమారి, డాక్టర్ అనీల అన్నారు. తుర్కపల్లి మండలం ముల్కపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన రైతు ముంగిట్లో - శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ దుంబాల రాంచంద్రయ్య, మాజీ సర్పంచ్‌లు ఇమ్మడి మల్లప్ప, అంజయ్య, ఏఈవో దివ్య, పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

● పర్యావరణ పరిరక్షణలో వృక్షాల పాత్ర కీలకమని, చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం భువనగిరి శివారులోని బొమ్మాయిపల్లిలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ మునిసిపల్ కౌన్సిలర్ జిట్టా వేణుగోపాల్ రెడ్డి, ఏఈవో వెంకట్రావు, భూగర్భనీటి శాఖ ఇంజనీయర్ నాగ అశ్విత్, పశువైద్యాధికారి దుర్గ, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ వెల్లంకి పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలి

భువనగిరి టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఇళ్లలో ఉత్పత్తి అయ్యే చెత్తను తడి, పొడి చెత్తగా వేరుచేసి ఇంటింటా చెత్త సేకరణ సిబ్బందికి ఇవ్వాలని మునిసిపల్ కమిషనర్ జి.రామలింగం సూచించారు. వందరోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం భువనగిరి మునిసిపల్ పరిధిలో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఉత్పత్తి అయ్యే చెత్తను రెండు వేరువేరు బుట్టలలో భద్రపరచాలని అన్నారు. అలాగే మురికి కాలువల పూడికతీత పనులను పరిశీలించి, చెత్తను కాల్వల్లో పారవేయవద్దని స్థానికులకు చెప్పారు. వందరోజుల ప్రణాళికలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు.

మెడికల్ కళాశాలపై స్పష్టత ఇవ్వాలి

యాదగిరిగుట్ట రూరల్, జూన్ 4, (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట మంజూరైన మెడికల్ కళాశాల నిర్మాణంపై ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య స్పష్టత ఇవ్వాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య డిమాండ్ చేశారు. బుధవారం గుట్టలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'మెడికల్ కళాశాలకు స్థలం ఇప్పటి వరకు ఎక్కడ నిర్మిస్తారు? స్థలం ఎక్కడ కేటాయించారు? లేక భువనగిరికి తరలిస్తారా?' అని ప్రశ్నించారు. అభివృద్ధి పేరుతో శంకుస్థాపనలు చేసి వాటికే పరిమితం అవుతారా? లేక వాటిని పూర్తిచేస్తారా అని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పాపట్ల నరహరి, నాయకులు పేరబోయిన సత్యనారాయణ, ఆరే శ్రీధర్‌గౌడ్, దండెబోయిన వీరేశం, కొన్యాల నర్సింహ్మరెడ్డి, షారాజీ రాజేష్, రాజు పాల్గొన్నారు.

గొల్లకురుమలకు నగదు బదిలీని ప్రారంభించాలి

భువనగిరి రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికల ముందు గొల్లకురుమలకు ఇస్తామన్న రూ.2లక్షల నగదు బదిలీ పథకం వెంటనే ప్రారంభించాలని జీఎంపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెపురం రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. 2017లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకంలో రెండు విడతలుగా జిల్లాలో 13వేల యూనిట్లు రావాల్సి ఉందన్నారు. సమావేశంలో సామాజిక వేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ కురుమ,జిల్లా అధ్యక్షులు దయ్యాల నర్సింహ, ఉపాధ్యక్షులు మద్దెపురం బాలనర్సింహ, నాయకులు దేవునూరి బాలయ్య, పాక జహంగీర్, రాజలింగం, మల్లేశ్ పాల్గొన్నారు.

1,165మందికి ఇందిరమ్మ ఇళ్లు

- *నాలుగు దఫాలుగా రూ.5లక్షలు మంజూరు*
- *అనర్హులుగా తేలినా, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినా రికవరీ*



భువనగిరి టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం లాంఛనంగా ప్రారంభమైంది. మొదటి దఫాలో సొంత ఇంటి స్థలాలు కలిగిన వారికి ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షల చొప్పున అందజేసే ప్రొసీడింగ్స్‌ను అందజేశారు. అయితే ప్రతి లబ్ధిదారుడు ఖచ్చితంగా ఇంటిని నిర్మించుకోవాల్సిందేనని లేని పక్షంలో అర్హుల జాబితా నుంచి తొలగిస్తామని, దఫాల వారీగా అందజేసిన మొత్తాన్ని రికవరీ చేస్తామని స్పష్టం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నియమ నిబంధనలను లబ్ధిదారులకు ఇస్తున్న ప్రొసిడింగ్స్‌లో పొందుపర్చారు. ఈ మేరకు నిబంధనలు ఇలా ఉన్నాయి..

మొదటి దఫాగా 1165 మందికి..

భువనగిరి పట్టణం, మండలంలో కలిపి మొదటి దఫాలో 1165 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. తదుపరి దఫాల్లో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు లభిస్తాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు. భువనగిరి మునిసిపల్ పరిధిలోని 35 వార్డులకు గాను మొదటి దఫాలో 492 మందికి ఇందిరమ్మ ఇందిరమ్మ ఇళ్లు లభించాయి. అత్యధికంగా 14వ వార్డులో 39 మందికి అత్యల్పంగా 10, 33, 34వ వార్డులలో ఇద్దరికి మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు లభించాయి.

వార్డుల వారీగా లబ్ధిదారుల సంఖ్య ఇలా..

1వ వార్డు (6), 2వ (28), 3వ (12), 4వ (18), 5వ (14), 6వ (19), 7వ (29), 8వ (31), 9వ (10), 10వ (2), 11వ (20), 12వ (8), 13వ (8), 14వ (39), 15వ (4), 16వ (3), 17వ (10), 18వ (17), 19వ (5), 20వ (25), 21వ (5), 22వ (12), 23వ (21), 24వ (34), 25వ (15), 26వ (15), 27వ (3), 28వ (11), 29వ (9), 30వ (7), 31వ (16), 32వ (21), 33వ (2), 34వ (2), 35వ వార్డు (11).

● భువనగిరి మండలంలో 33 గ్రామాలకు గాను మొదటి దఫాలో 673 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. అత్యధికంగా బండసోమారం గ్రామంలో 116 మందికి, అత్యల్పంగా సిరివేణికుంటలో కేవలం ఐదుగురికే ఇందిరమ్మ ఇళ్లు లభించాయి. అయితే ఈ పాటికే 45మంది బేస్‌మెంట్ లెవల్, 8మంది స్లాబ్ లెవల్ పూర్తి చేసి రూ.53లక్షలు బిల్లులు పొందినట్లు అధికారులు తెలిపారు.

గ్రామాల వారీగా లబ్ధిదారుల సంఖ్య ఇలా..

బండసోమారం (116), హన్మపూర్ (39), బొల్లెపల్లి (36), అనాజిపురం, అనంతారం, వీరవెల్లి (30 చొప్పున), చందుపట్ల (29), బస్వాపూర్ (27), తుక్కాపూర్ (24), కూనూరు, తాజ్‌పూర్, వడపర్తి (20 చొప్పున), చీమలకొండూరు, నందనం, ముత్తిరెడ్డిగూడెం (19 చొప్పున), గౌస్‌నగర్, నాగిరెడ్డిపల్లి, రెడ్డినాయక్ తండా, సూరేపల్లి (15 చొప్పున), నమాత్‌పల్లి, పచ్చర్లబోడు తండా (14 చొప్పున), వడాయిగూడెం (11), ఆకుతోటబావి తండా, బాలంపల్లి, కేసారం, మన్నెవారిపంపు, పెంచికల్‌పహాడ్, రామచంద్రపూర్ (10 చొప్పున), ముస్త్యాలపల్లి (9), ఎర్రంబెల్లి (7) గంగసానిపల్లి, జమ్మాపూర్ (6 చొప్పున), సిరివెనికుంట (5).

నిబంధనలు ఇలా..

1) ప్రొసిడింగ్స్ అందిన 45 రోజుల లోపు ఇంటి నిర్మాణం ప్రారంభించి ఏడాది లోపు పూర్తి చేయాలి.

2) 400 చదరపు అడుగుల విస్తీర్ణానికి తగ్గకుండా 600 చదరపు అడుగులకు మించకుండా ఆర్‌సిసి స్లాబ్‌తో నిర్మించాలి. తప్పనిసరిగా రెండు గదులతో పాటు వంటగది మరుగుదొడ్డి ఉండాలి.

3) ఇంటి నిర్మాణం పూర్తయ్యాక కూడా పథకానికి అనర్హులుగా తేలినా, నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లు నిర్మించినా మంజూరును రద్దు చేసి అప్పటి వరకు చెల్లించిన బిల్లులను ఆర్ఆర్ చట్టం ప్రకారం రికవరీ చేస్తారు.

4) ఇంటి నిర్మాణానికి మంజూరైన రూ.5లక్షలను నాలుగు దఫాలుగా మంజూరు చేస్తారు. మొదటి బిల్లు బేసెమిట్ నిర్మించాక రూ.1లక్ష, రెండో బిల్లు గోడలు కట్టాక రూ.1లక్ష, మూడో బిల్లు స్లాబ్ వేసిన తర్వాత రూ.2లక్షలు, చివరి బిల్లు (మరుగుదొడ్డి, ప్లాస్టింగ్, తలుపులు బిగించాక) రూ.1లక్ష.

రసాయన ఎరువులు మోతాదు మించితే నష్టమే

నకిలీ విత్తనాలు ఎలా గుర్తించాలి భూసార పరీక్షలు ఎలా చేస్తారు? : మారగోని శ్రీరాంమూర్తిగౌడ్, రుస్తాపురం, తుర్కపల్లి మండలం

ఏడీఏ: నకిలీ విత్తనాలపై ఐఎస్ఐ మార్క్ తేదీ ఎక్స్‌పైరీ తేదీ ఉండదు. దళారులు రాత్రి సమయంలో గ్రామాలకు వచ్చేసి తక్కు వ ధరకు విక్రయిస్తారు. భూసార పరీక్షలు రైతులు కొంత భూమిని శాంపిల్‌గా సేకరించి, భూపరీక్ష కేంద్రాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలి.

ఎలాంటి వరి విత్తనాలు సాగుచేసుకుంటే లాభసాటిగా ఉంటుంది?: బబ్బూరి శ్రీను, గౌరాయిపల్లి

ఏడీఏ: తెలంగాణ సోనా, కునారం వరి, హెచ్ఎంటీ సోనా, బీపీటీ, 15048, 5204 సన్నరకాలు, దొడ్డు ఎంటీయూ 1010, కేఎస్ఎం118, జెజిఎల్ 24423 లాభసాటిగా ఉంటాయి.

సేంద్రియ ఎరువులతో లాభం ఏమిటి? రసాయన ఎరువులతో నష్టం ఏమిటి?: కల్లెపల్లి మహేందర్ చిన్నకందుకూర్

ఏడీఏ: సేంద్రియ ఎరువులు వాడటంతో భూసారం నష్టం కాకుండా పంట దిగుబడి ఎక్కువగా వస్తుంది. రసాయన ఎరువులు అధికంగా వాడటంతో భూసారం తగ్గుతుంది.

విత్తనాలు, ఎరువులు ఎక్కడ కొనుగోలు చేస్తే మేలు , సబ్సిడిపై విత్తనాలు ఇస్తున్నారా?

పేరబోయిన బంగారి కొత్తగుండ్లపల్లి, ఆకుల బాలరాజు, గౌరాయిపల్లి.

ఏడీఏ: విత్తనాలు, ఎరువులు కేవలం లైసెన్సు ఉన్న డీలర్లు, సొసైటీల వద్ద కొనుగోలుచేయాలి. ప్రస్తుతం ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు ఇవ్వడం లేదు.

నకిలీ విత్తనాలు, రసాయన ఎరువుల విక్రయాలను ఎలా అరికడతారు? గ్రామాల్లో రైతు సదస్సులు నిర్వహించడం లేదు?

గోద శ్రీరాములు, యాదగిరిగుట్ట, బెజాడికుమార్ కాచారం, కొల్లూరు రాజయ్య ధర్మారెడ్డిగూడెం.

ఏడీఏ: గ్రామాల్లో నకిలీ విత్తనాలు, రసాయన ఎరువులు విక్రయించే వారిపై ఎస్‌వోటీ పోలీలు ఆకస్మిక దాడులు నిర్వహించి, అవసరమైతే క్రిమినల్ కేసులు పెట్టి వాటిని నివారిస్తారు. గ్రామాల్లో రైతుల వేదికలో శాస్త్రవేత్తలు, ఏవోలు రైతులతో అవగాహన సదస్సులు నిర్వహించి పలు సలహాలు సూచనలు చేస్తారు.

చౌడు భూములలో ఎలాంటి పంటలు సాగుచేయాలి? సాధునేని భాస్కర్‌రావు, పెద్దిరెడ్డిగూడెం

ఏడీఏ: చౌడు నేలలో జీలుగ వేస్తే లాభసాటిగా ఉంటుంది.

-(ఆంధ్రజ్యోతి, యాదగిరిగుట్ట రూరల్)

గంధమల్ల భూ నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

తుర్కపల్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): గంధమల్ల రిజర్వాయర్ ఏర్పాటును తాము స్వాగతిస్తున్నామని, కానీ రిజర్వాయర్‌లో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు న్యాయపరమైన పరిహారం ఇవ్వాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిన్నెపురెడ్డి నరేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పోగుల ఆంజనేయులు, పలుగుల నవీన్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గంధమల్ల రిజర్వాయర్‌తో ఉపాధి కోల్పోతున్న నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, పెళ్లి కాని ఆడ పిల్లలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మండల కేంద్రంలోని సర్వే నెం 72లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు భూ సేకరణ చేశామని, మండలంలోని చిన్నలక్ష్మాపూర్‌లో 100ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందని ఈ భూముల్లో కాలుష్య రహిత కంపెనీలు ఏర్పాటు చేసి, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అంతే కాకుండా మండల కేంద్రంలో 100 పడకల ఆసుపత్రిని నిర్మించాలని, మండలంలో అత్యధిక సంఖ్యలో గిరిజనులు ఉన్నారు కాబట్టి వారికి మండల కేంద్రంలో గిరిజన భవనాన్ని నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. కొండ పోచమ్మ ప్రాజెక్టు ద్వారా మండలంలోని అన్ని చెరువులను నింపే విధంగా తగు చర్యలు చేపట్టాలని కోరారు. కొంత మంది రైతులకు రైతు భరోసా రాలేదని, బ్యాంకుల్లో రుణ మాఫీ కాలేదని, వారందరికీ వెంటనే రైతు భరోసా, రుణమాఫీ చేయాలని కోరారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లో ఎస్సీ, ఎస్టీలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌లు ఇమ్మడి మల్లప్ప, వై.రాజయ్య, నాయకులు మేకల బాలకృష్ణ, మాడిశెట్టి సురేందర్, జి.బద్దునాయక్, బానోత్ భాస్కర్‌నాయక్, భూక్య రాజేష్‌నాయక్, నల్ల శ్రీకాంత్, బానోత్ శ్రీనునాయక్ ఉన్నారు.

రావి నారాయణరెడ్డి పోరాటం స్ఫూర్తిదాయకం



ఆత్మకూరు(ఎం): నారాయణరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

భువనగిరి గంజ్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ విముక్తి కోసం సాయుధ పోరాటానికి సారథ్యం వహించిన రావి నారాయణరెడ్డి పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం రావి నారాయణరెడ్డి 118వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం సంస్థానంలో రాచరిక వ్యవస్థపై తిరుగుబాటు చేసి, తెలంగాణను భారత యూనియన్‌లో కలిపేందుకు నైజామును గద్దె దించాలని సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని గుర్తు చేశారు. దున్నేవాడికి భూమి కావాలని నినాదం ఇచ్చిన ప్రథమ వ్యక్తి అని, ముందుగా 500ఎకరాలు సొంత భూమిని పేదలకు పంచిన త్యాగశీలి అని కొనియాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి దాసరి లక్ష్మయ్య, పుట్ట రమేష్, ముద్దసాని రాములు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: పట్టణంలోని సీపీఐ కార్యాలయం ఆవరణలో రావి నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, పేరబోయిన పెంటయ్య, పేరబోయిన బంగారి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరు : మోత్కూరు కేఆర్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పాశికంటి లక్ష్మీనర్సయ్య, సీపీఐ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, నాయకులు చాపల అంజయ్య, బోయిని ఉప్పలయ్య, గొలుసుల యాదగిరి, తాడూరు లక్ష్మీనర్సయ్య, పెండెం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రామన్నపేట: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ, నాయకులు శివరాత్రి సమ్మయ్య, బాలగోని మల్లయ్య, ఊట్కూరి భగవంతు, వీరమల్ల ముత్తయ్య, గంగాపురం వెంకటయ్య, రచ్చ యాదగిరి, గంగాపురం మల్లమ్మ, సిహెచ్ మల్లేశం, ఊట్కూరి కృష్ణ, పర్స సుదర్శన్, కళ్యాణ్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉప్పల ముత్యాలు, మండల కార్యదర్శి ఎం.వెంకటేశం, పి.పురుషోత్తం, జె.దయాకర్‌రెడ్డి, సత్తయ్య, అంజయ్య, రాములు పాల్గొన్నారు.

వలిగొండ: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బోడ సుదర్శన్, మండల కార్యదర్శి పోలేపాక యాదయ్య నాయకులు రవీందర్ , సుదర్శన్, లక్ష్మీనారాయణ, అంజనేయులు, యాదగిరి పాల్గొన్నారు.

ఒకే రోజు రెండు ఇళ్లలో చోరీ

మోత్కూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామంలో బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. బాధితుడు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... కల్లు గీత కార్మికుడు అంబటి లక్ష్మయ్య పని మీద హైద్రాబాదు వెళ్లి వచ్చి మధ్యాహ్నం 3.30 గంటలకు తాటిచెట్ల నుంచి కల్లు తీయడానికి వెళ్లాడు. అతని భార్య వరి నాటు వేయడానికి వెళ్లింది. అతని తండ్రి ఆ ఇంటి ఎదురుగా ఉన్న ఇంటి అరుగు మీదనే కూర్చున్నాడు. సాయంత్రం తాళ్ల నుంచి వచ్చిన లక్ష్మయ్య ఇంట్లోకి వెళ్లే సరికి బీరువా తాళం పగులగొట్టి ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి వెనుక నుంచి ఇంట్లో జొరబడి బీరువా తాళం పగులగొట్టి రూ.1.25లక్షలు, సుమారు నాలుగు తులాల బంగారం ఎత్తుకెళ్లినట్టు గుర్తించారు. ఆయన వెంటనే పోలీసులకు సమాచారం అందించగా క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు సేకరిస్తున్నారు. డాగ్‌స్క్వాడ్‌ను కూడా రప్పించారు. తొంట అంజికుమార్ తల్లి ఒంటరిగా ఉంటోంది. ఆమె కూడా వరి నాటు వేయడానికి వెళ్లింది. ఇంటి తాళం పగులకపోవడంతో గడియను కట్ చేసి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి వెళ్లారని, అక్కడ రూ.రెండు వేలు మాత్రమే ఎత్తుకెళ్లారని చెబుతున్నారు. పోలీసులు సంఘటనా స్థలాలకు వెళ్లి విచారణ జరుపుతున్నారు. గ్రామంలో ఒకే రోజు రెండు ఇళ్లలో దొంగతనాలు జరుగడంతో గ్రామస్థులు భయాందోళనలకు గురవుతున్నారు.

ఇది ఇలా ఉం డగా మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని సుందరయ్య కాలనీలో గుడిపూడి కళ్యాణి అనే మహిళ ఇంటి ఆవరణలో సెల్‌ఫోన్ చోరీ గురైంది. మధ్యా్హ్నం ఆమె ఫోన్ మాట్లాడిన కొంత సేపటి తర్వాత చూసే సరికి ఫోన్ కనుపించలేదు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వెళ్లి వివరాలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

చౌటుప్పల్ రూరల్, జూన్4(ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ పట్టణ కేంద్రం జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది. సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన రియల్ ఎస్టేట్ ఏజెంట్ ఆల్టో కారులో చౌటుప్పల్‌కు వస్తుండగా ముందుగా ఉన్న ఇండికా కారును ఢీకొట్టాడు. అదే సమయంలో వెనుక వైపు నుంచి వస్తున్న లారీ ఆల్టో కారును ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆల్టో కారులో ఉన్న శ్రావణి (29) దుర్మరణం చెందింది. ఇండికా కారులో ఉన్న శ్రీనివాస్ రావు, నిఖిలేష్, ఆల్టో కారులో ఉన్న రేణుకలు గాయపడ్డారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మధకుమార్ తెలిపారు.

ఆలేరు రెవె'న్యూ డివిజన్' ఏర్పాటయ్యేనా?

(5వ పేజీ తరువాయి)

సిద్ధం చేసింది. గత ప్రభుత్వ హయాంలో రూపొందించిన నివేదిక ప్రకారం ప్రస్తుతం 12 మండలాలు గల భువనగిరి రెవెన్యూ డివిజన్‌ను రెండుగా విభజించాలని ప్రతిపాదన చేశారు. భువనగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఏడు మండలాలు, కొత్తగా ఏర్పాటు కానున్న ఆలేరు డివిజన్‌లో ఐదు మండలాలు ఉండేలా ప్రతిపాదించారు. భువనగిరి, బీబీనగర్, బొమ్మలరామారం, తుర్కపల్లి, ఆత్మకూరు(ఎం), మోత్కూరు, అడ్డగూడూరు మండలాలతో కలిపి భువనగిరి రెవెన్యూ డివిజన్‌గా, ఆలేరు, యాదగిరిగుట్ట, రాజాపేట, మోటకొండూరు, గుండాల మండలాలు ఆలేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండేలా ప్రతిపాదించారు. డివిజన్లుగా విభజన అనంతరం భువనగిరి రెవెన్యూ డివిజన్ 1,555 చదరపు కిలోమీటర్ల భౌగోళిక విస్తీర్ణంతో 3,08,254 జనాభా ఉండనుంది. ఈ డివిజన్ పరిధిలో 139 రెవెన్యూ గ్రామాలు, 183 గ్రామ పంచాయతీలు, రెండు మునిసిపాలిటీలు ఉంటాయి. కొత్తగా ఏర్పాటు కానున్న ఆలేరు రెవెన్యూ డివిజన్ 1,020 చదరపు కిలోమీటర్లు, 1,83,028 జనాభా కలిగి ఉండనుంది. ఈ డివిజన్ పరిధిలో 72 రెవెన్యూ గ్రామాలు, 98 గ్రామపంచాయతీలు, రెండు మునిసిపాలిటీలు కార్యకలాపాల నిర్వహణ ఉండేలా ప్రతిపాదనలు రూపొందించారు.

ఎమ్మెల్యే ప్రకటన చేయించాలి

తిర్మలాపురంలో ఈ నెల 6న జరిగే సీఎం బహిరంగ సభలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య రెవెన్యూ డివిజన్‌పై అధికారిక ప్రకటన చేయించాలి. తాను గెలిచిన వంద రోజుల్లోనే రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేస్తానన్న మాటను నిలబెట్టుకోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా అసెంబ్లీ సమావేశాల్లో రెండు సార్లు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు కాకపోవడం శోచనీయం. ఎమ్మెల్యే చిత్తశుద్ధితో స్పష్టమైన ప్రకటన చేయించాలి.

-పసుపునూరి వీరేశం, ఆలేరు రెవెన్యూ డివిజన్ పోరాట సాధన కమిటీ కన్వీనర్

గోరక్షణ చట్టాలు అమలు చేయాలి

భూదాన్‌పోచంపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం గోరక్ష చట్టాలను కఠినంగా అమలు చేయాలని జిల్లా విశ్వహిందూ పరిషత్, గోరక్ష సమితి జిల్లా నాయకులు బల్ల దుర్వాసులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని గోసేవ సమితి కార్యాలయంలో నిర్వహించిన గోసేవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణప్రభుత్వం గోరక్ష చట్టాలు అమలుచేయడంలో విఫలం అయినందుకు నిరసనగా, గోరక్ష కార్యకర్తలపై జీహాద్ గుండాల దాడికి నిరసనగా, తెలంగాణ పోలీసులు గోరక్ష కార్యకర్తలపై అక్రమ కేసులను బనాయించడానికి నిరసనగా ఈనెల 5న గురువారం అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించే రాష్ట్ర వ్యాప్త నిరసనలు జయప్రదం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్ మండల అధ్యక్షుడు కటకం తుకారాం తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల డీలర్లకు పీఎస్‌వో పరికరం

యాదగిరిగుట్ట రూరల్, జూన్ 4. (ఆంధ్రజ్యోతి): దేశంలో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) పథకానికి లోబడిన సబ్సిడీ ఎరువులను రైతులకు సరఫరా చేసే ఎరువల డీలర్లకు పాయింట్ ఆఫ్‌సేల్ (పీవోఎస్) పరికరం యాదగిరిగుట్ట డివిజన్ ఏడిఏ శాంతినిర్మల అందజేశారు.

కనకదుర్గ ఆలయంలో బ్రహ్మోత్సవాలు

ఆలేరు, జూన్4(ఆంధ్రజ్యోతి): ఆలేరు కేంద్రంలోని శ్రీ మల్లీశ్వర స్వామి సహిత కనకదుర్గ దేవి ఆలయ 10వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆలయ అర్చకులు ఆలేటి రంగారావు పంతులు ఆధ్వర్యంలో వివిధ రకాల పూజలు, అభిషేకాలు నిర్వహించారు.